

చిన్నకోడూరు శివారులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న రైల్వే అధికారులు

చిన్నకోడూరుకు

రైలు కూత

- మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్‌లో తొలిసారి ట్రయల్ రన్

చిన్నకోడూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ - కొత్తపల్లి రైల్వేలైన్ పనుల్లో భాగంగా సిద్దిపేట పట్టణ శివారులోని రైల్వేస్టేషన్ నుంచి చిన్నకోడూరు మండలం మాచాపూర్ శివారు వరకు రైల్వేఅధికారులు మొదటిసారిగా బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. సిద్దిపేట, మందపల్లి, పెద్దకోడూరు, చిన్నకోడూరు, చంద్లాపూర్, మాచాపూర్ గ్రామాలకు చెందిన ప్రజలు సుమారు 9 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ ట్రయల్ రన్‌ను ఆసక్తిగా తిలకించారు. తమ గ్రామాలకు తొలిసారిగా రైలు రావడంతో స్థానికులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.

హరీశ్‌రావు హర్షం

బీఆర్ఎస్ హయాంలో సిద్దిపేటలో రైలును ప్రారంభించి ప్రాంత ప్రజల కలను నెరవేర్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట నుంచి చిన్నకోడూరు మండలం మాచాపూర్ శివారు వరకు రైలు ట్రయల్ రన్ విజయవంతం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

సంగారెడ్డి ప్రజలకు స్వచ్ఛమైన మంజీరా నీళ్ల సరఫరాపై జగ్గారెడ్డి సమీక్ష

- మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి రాజంపేట ఫిల్టర్ బెడ్‌ను తనిఖీ చేసిన జగ్గారెడ్డి





సంగారెడ్డిలోని రాజంపేట ఫిల్టర్‌బెడ్ వద్ద నిర్వహించిన సమీక్షలోమాట్లాడుతున్న జగ్గారెడ్డి, ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తూ..

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో తాగునీటి సమస్యపై మున్సిపల్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాజంపేటలో ఉన్న ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారలకు జగ్గారెడ్డి పలు సూచనలు చేశారు.

- 2010లో మంజీరా వాటర్ స్కీమ్ ప్రారంభించినప్పుడు ఒకేసారి పది ట్యాంకులు నిండి గంటన్నర నీటి సరఫరా జరిగేది. ఇప్పుడు కూడా అలాగే జరిగేలా చూడాలి.
- మిషన్ భగీరథ కోసం సింగూరు ప్రాజెక్టు వద్ద రూ.100 కోట్లతో నిర్మించిన ఫిల్టర్‌బెడ్‌ను పదేళ్ల ఒక కాంట్రాక్టర్‌కు మెయింటెనెన్స్‌కు ఇచ్చారని, అతను పట్టించుకోకపోవడంతో డిస్ట్రిబ్యూషన్ లైన్స్ పాడై సరఫరాకు ఇబ్బందవుతుందని జగ్గారెడ్డికి అధికారులు వివరించారు.
- పాతలైన్ల స్థానంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ లైన్‌లు నాణ్యతగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని జగ్గారెడ్డి దృష్టికి తెచ్చారు.
- పట్టణంలో పది ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా అయ్యేలా చూడాలని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు.
- ఫిల్టర్‌బెడ్ విస్తరణకు మూడు ఎకరాల ప్రైవేట్ భూమి కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.
- ఇంకా పాత పద్ధతుల్లోనే నీటిని ఫిల్టర్ చేస్తున్నారని, ఫిల్టర్‌బెడ్‌లో అపరిశుభ్రత ఉంటుందని స్థానికులు జగ్గారెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేశారు.
- ఫిల్టర్‌బెడ్ నిర్వహణ మున్సిపల్‌దా లేక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారా అని అధికారులను జగ్గారెడ్డి అడిగారు.
- గతంలో ఫిల్టర్‌బెడ్ నిర్వహణకు సదరు కాంట్రాక్టర్ డబ్బు ఇవ్వకపోతే సబ్‌కాంట్రాక్టర్‌కు జగ్గారెడ్డి రూ.20 లక్షల తన స్వంత నిధులను ఇచ్చిన విషయాన్ని ఓ కాంట్రాక్టర్ గుర్తు చేశారు.
- ఫిల్టర్‌బెడ్ నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించేలా అనుమతి ఇవ్వాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు లేఖ ద్వారా విన్నవించాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రఘు, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్‌కుమార్, మహేష్, కిరణ్‌గౌడ్, రాజంపేట శ్రీనివాస్, అరుణ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు

దరఖాస్తుల ఆహ్వానం



సిద్దిపేటకల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 5న గురుపూజోత్సవం సందర్భంగా అందించే జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఉపాధ్యాయులు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రధానోపాధ్యాయులకు 15 సంవత్సరాలు, ఉపాధ్యాయులకు 10 సంవత్సరాల సర్వీస్ పూర్తయి ఉండాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మండల విద్యాధికారికి, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుల ద్వారా, ప్రధానోపాధ్యాయులు నేరుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేయవచ్చని తెలిపారు.



నంగునూరు సహకార సంఘం ఎదుట ఎరువుల కోసం లైన్‌లో నిల్చున్న రైతులు

క్యూకట్టి.. రోడ్డెక్కి..

- యూరియా కోసం అన్నదాతల అవస్థలు..
- తెల్లవారుజాము నుంచే సహకార సంఘాల వద్ద బారులు
- ఆందోళనలు, రాస్తారోకోలు

7



అంతర్గత కమిటీల ఏర్పాటులో భాగంగా మహిళల రక్షణ వాల్ పోస్టర్లతో అధికారులు

మహిళల రక్షణకు ప్రత్యేక కమిటీలు

- లైంగిక వేధింపుల నివారణే లక్ష్యం

మద్దూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో, పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులను నివారించడానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మద్దూరు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కమిటీలను వేశారు. అలాగే మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామపంచాయతీలో బోర్డులు ఏర్పాటు చేసి ఎంత మంది మగ, ఆడపిల్లలు పుడుతున్నారనే వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. పనిప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించడానికి కృషి చేస్తున్నట్లు మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ పద్మ తెలిపారు. స్టేట్ లెవల్‌లో సీబాక్స్ పోర్టల్‌లో కమిటీ సభ్యులను చేరుస్తున్నామని ఆమె చెప్పారు. ఆడపిల్లలను రక్షిద్దాం, పుట్టనిద్దాం, ఎదగనిద్దాం.. అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. మహిళల చట్టాలు, పోక్సో చట్టంపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ వి.లావణ్య, ఆర్థిక అక్షరాస్యత నిపుణులు ఎస్.నాగరాజు, ఎంపీడీవో రామ్మోహన్, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


త్వరలో 'సీఐఆర్' హెడ్‌క్వార్టర్ ప్రారంభం

- సీపీ అనురాధ



సీఐఆర్ హెడ్ క్వార్టర్‌ను సందర్శిస్తున్న సీపీ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన సీఐఆర్ (కమాండ్ అండ్ రిజర్వ్) హెడ్ క్వార్టర్‌ను త్వరలో ప్రారంభిస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. బుధవారం ఆమె భవనాన్ని సందర్శించి పనులను పరిశీలించి మాట్లాడారు. మిగిలిన చిన్న చిన్న పనులను పూర్తి చేసి భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కాంట్రాక్టర్, హౌసింగ్ బోర్డ్ ఏఈ సుధాకర్, పోలీస్ అధికారులకు సూచించారు. సీపీ వెంట ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణి కుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రం ఇంటి ఎదుట గుమిగూడిన జనం

మల్లన్నసాగర్‌లో కొత్త లొల్లి

- భార్య పిల్లలతో కలిసి వ్యక్తి అదృశ్యం

7

చెరువుల్లోకి..చేప

- పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం
- డీపీసీ పర్యవేక్షణలో టెండర్ల ప్రక్రియ
- జిల్లాలోని 1,715 చెరువుల్లో 4.42 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు సన్నాహాలు

సిద్దిపేట కలెక్టరేట్ ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రిజర్వాయర్లు, చెరువులు కలిపి 1715 ఉన్నాయి. 378 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 40 మహిళా మత్స్యకార సంఘాలు ఉన్నాయి. మొత్తగా 24,698 మంది మత్స్యకారులు చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. విస్తారంగా కురిసిన వర్షాలతో జలాశయాల్లో నీరు చేరడంతో చేప పిల్లల పెంపకానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లాలో జలాశయాల విస్తీర్ణం, వనరుల ఆధారంగా 4.42కోట్ల చేప పిల్లలకు టెండర్లు నిర్వహించడానికి రాష్ట్ర మత్స్య శాఖ అనుమతి ఇచ్చింది. 35-40 మి.మీ. సైజు చేప పిల్లలు 1.79 కోట్లు కాగా.. 80-100 మి.మీ. సైజు చేప పిల్లలు 2.63 కోట్ల పిల్లలకు టెండర్లు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

టెండర్లకు 1 వరకు గడువు

ఈ పథకం కోసం ఏర్పాటు చేసిన జిల్లా పర్చేజింగ్ కమిటీ (డీపీసీ) పర్యవేక్షణలో టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తారు. ఈ కమిటీకి అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సభ్యులుగా జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఉంటారు. సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాంపై టెండర్లను అప్‌లోడ్ చేయాలని అధికారులు తెలిపారు.



కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఈ క్రమంలో మత్స్యకారుల కోసం చేప పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టెండర్ల ప్రక్రియ ఆలస్యమైనప్పటికీ, చేప పిల్లల పంపిణీకి టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మత్స్యకారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలోనే చేపపిల్లల పంపిణీ చేసిన కాంట్రాక్టర్లకు సరిగ్గా బిల్లులు చెల్లించని పక్షంలో ఈ సారి టెండర్లలో పాల్గొంటారా? లేదా అన్నది తెలియాల్సి ఉంది

కాంట్రాక్టర్లలో సందేహం

మూడేళ్ల నుంచి చేప పిల్లలు పంపిణీ చేసిన సుమారు రూ. 4.50 కోట్ల బకాయి బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో, వారు టెండర్లలో పాల్గొంటారా లేదా అనే సందిగ్ధం

మిగతా 8వ పేజీలో



లాల్‌కమాన్ గడి మైసమ్మ బోనాల్లో హరీశ్‌రావు

మన సంస్కృతికి బోనాలు నిలువుటద్దం

- ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బోనాలు నిలువుటద్దమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని లాల్‌కమాన్ గడి మైసమ్మ బోనాల మహోత్సవంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే సిద్దిపేట లింగారెడ్డి పల్లి కాలనీలో శ్రీరామభక్త ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలోనూ హరీశ్‌రావు పాల్గొన్నారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంటుందని ఆయన హితవు పలికారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి

- వరద పెరిగితే రాకపోకలు ఆపేయాలి
- కలెక్టర్ హైమావతి



అక్కెనపల్లి మోయతుమ్మెద వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్‌రూరల్/నంగునూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రోడ్లు, భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆర్డీవో రామ్మూర్తితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. భవన నిర్మాణాలకు స్థలాల సమస్య ఉన్నచోట తహసీల్దార్లు, ఎంపీడీవోలు వెంటనే పరిశీలించాలని చెప్పారు. ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులు, బతుకమ్మ ఘాట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. జాతీయ రహదారి పనులు పూర్తవుతున్నందున జిల్లెలగడ్డ, పోతారం (ఎస్), పందిల్ల, హుస్నాబాద్, సముద్రాల బస్వాపూర్ గ్రామాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు నిండుగా ప్రవహిస్తున్నాయని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. బుధవారం ఆమె నంగునూరు మండలం అక్కెనపల్లి మోయ తుమ్మెద వాగుతో పాటు ఘనపురం, ఖాతా గ్రామాల్లోని పలు చెక్‌డ్యాంలను, లో లెవల్ వంతెనలను పరిశీలించారు. వర్షాలు పెరిగితే లో లెవెల్ వంతెనల మీదుగా నీరు ప్రవహిస్తుందని, అలాంటి సమయంలో రాకపోకలను నిలిపివేయాలని అధికారులకు సూచించారు.

రేపటి నుంచి గ్రామాల్లో పనుల జాతర

8

స్థానిక ఎన్నికల్లో గెలుపు మనదే

- యూరియా కొరతకు కేంద్రమే కారణం
- దుబ్బాక ఎమ్మెల్యే ఢిల్లీలో ధర్నా చేస్తే ఫలితం ఉంటుంది
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

దుబ్బాక, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర కార్మిక, గనులు, ఉపాధిశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్యకర్తల్లో ఇదే ఉత్సాహం కొనసాగితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం తమదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బుధవారం దుబ్బాక నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... దుబ్బాక నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున చెరుకు శ్రీనివాసరెడ్డికి ఒక పదవి ఇప్పించే బాధ్యత తనదని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, జిల్లాలో 50 శాతం పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, బేస్‌మెంట్ బిల్లుల కింద రూ.లక్ష అందిస్తున్నామని వివరించారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో 17 లక్షల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాష్ట్రానికి 7 లక్షల టన్నుల యూరియాను అందించాల్సిన కేంద్రం అందులో సగం కూడా సరఫరా చేయలేదన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి యూరియా కొరతపై ఇక్కడ ధర్నా చేస్తే ఫలితం ఉండదని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలో ధర్నా చేయాలని సూచించారు. జిల్లాకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ, కొంతమంది కావాలనే ఎక్కువ మొత్తంలో యూరియాను తీసుకెళ్లి బ్లాక్ చేసి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బ్లాక్ చేసే ఫర్టిలైజర్ షాపుల లైసెన్స్‌లను రద్దు చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో కార్యకర్తలు తమ ఆవేదనను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వెంట దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, గాందారీ నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కాల్వ నరేష్, అనంతుల శ్రీనివాస్, ఏసురెడ్డి, రమేష్‌గౌడ్, చంద్రారెడ్డి, సాయితేజాగౌడ్ పలువురు ఉన్నారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

ఇంటికి రూ.5వేల చొప్పున ఇవ్వు!

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏఈ చేతివాటం
- మేస్త్రీని లంచం అడిగిన ఆడియో వైరల్

6

సైబర్ నేరాలపై అప్రమత్తత

రేగోడు ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పోచయ్య సూచించారు. బుధవారం రేగోడు గాంధీ చౌక్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఇతరులకు చెప్పొద్దని అన్నారు. ఏదైనా సందర్భంలో డబ్బులు పోగొట్టుకుంటే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

60 పరిశ్రమల పన్ను వాణిజ్య సరళిలోకి ..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఐడీఏబొల్లారం ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో, ప్రచురితమైన రావాల్సింది రూ.8కోట్లు.. వసూలు చేసేది రూ.12.40లక్షలు అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆర్వో నర్సింహులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని కమిషనర్ కిషన్ ఏర్పాటు చేశారు. రెసిడెన్షియల్ జోన్‌లో ఉన్న పరిశ్రమలను గుర్తించే సర్వే చేయించారు. 93 పరిశ్రమలు రెసిడెన్షియల్ జోన్‌లో ఉన్నట్టు గుర్తించారు. వాటన్నిటికి వాణిజ్యసరళిలో పన్నులు వసూలు చేయనున్నారు. ఇప్పటి వరకు 60 పరిశ్రమలను వాణిజ్యసరళిలోకి మార్చారు. దీంతో రూ.వేలల్లో ఉన్న పన్ను లక్షల్లోకి చేరింది.

మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించాలి

- వినాయకచవితి శాంతియుతంగా జరుపుకోవాలి
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- విద్యుత్ అనుమతులు పొందాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాసరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. మండపాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని, వర్షాలతో పాడైన రోడ్లను మరమ్మతులు చేయాలని, అన్నదానం రోజున తాగు నీటి సదుపాయని కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 27 నుంచి జరిగే వినాయక ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో సామరస్యపూర్వకంగా నిర్వహించుకోవడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మట్టి గణపతిని పూజిద్దామని, పర్యావరణాన్ని పరిరక్షిద్దామనే నినాదంతో వినాయకులను ప్రతిష్ఠించాలన్నారు. మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి వివిధ ప్రాంతాలల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ ద్వారా గణపతి మండపాలకు అనుమతులు జారీ చేయాలని, తీగలు కింద, స్తంభాల పక్కన మండపాలను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శనానికి తగిన ఏర్పాట్లు చేయలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నిర్వాహకులు పోలీసులతో సమన్వయం కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్వో భుజంగరావ్వు తదితరులు పాల్గొన్నారు.







కొండపోచమ్మకు గోదారమ్మ


కొండపోచమ్మసాగర్‌లోని విడుదల చేసిన నీరు

మర్కుక్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీటి పంపింగ్ ప్రారంభించారు. ప్రస్తుతం ఒక పంపు ద్వారా ఆ నీటిని పంపింగ్ చేస్తున్నామని, వరద ఉధృతిని బట్టి మిగిలిన పంపులను ప్రారంభిస్తామని కొండపోచమ్మ ఇరిగేషన్ ఏఈ సాయిరెడ్డి తెలిపారు.

ఇంటికి ఐదు వేల చొప్పున ఇవ్వు..!

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏఈ చేతివాటం.!
- మేస్త్రీని లంచం అడిగిన ఆడియో వైరల్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు చేపట్టిన మేస్త్రీ వద్ద ఇంటికి రూ. 5 వేల చొప్పున పట్టుకురమ్మని హౌసింగ్ ఏఈ ఫోన్ చేసిన ఉదంతం ఇది. ఇందుకు సంబంధించిన ఆడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామాన్ని ఎంపిక చేశారు. గ్రామంలో 183 మందికి ఇళ్లు మంజూరు కాగా, గ్రామానికి చెందిన మేస్త్రీ వెంకటయ్య 18 మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో హౌసింగ్ ఏఈ ఫోన్ చేసి లంచం డిమాండ్ చేసినట్లు ఆడియో వైరల్ అవుతోంది. ఆ ఆడియాలో.. 'ఎన్ని ఇళ్లు కడుతున్నావయ్యా.. నేను బిల్లులు ఇచ్చే పెద్దసారును. 18 కడుతున్నావ్.. సార్‌ను కలువాలనే బుద్ధి, జ్ఞానం ఏమైనా ఉన్నదా.. నీకు. తెలువకపోతే తెలుసుకోవాలి. నన్ను వెంకయ్య సార్ అంటారు. మీ సెక్రటరీకి తెలుసు. నేను అమౌంట్ అడుగుతానని ఊరుకున్నాడు. ఒక్కో ఇంటికి రూ. 5 వేలు, రూ. 10 వేలు ఇస్తారు. సారుకు ఇవ్వాలని తెలువదా.. అడిగేదాక చూస్తారా' అని ఏఈ మాట్లాడినట్లు ఉంది. ఇందుకు సమాధానంగా మేస్త్రీ 'ధరలు ఎక్కువగా ఉన్నాయి' అనగా, ఇంటికి రూ. 5 వేల చొప్పున రూ.25 వేలు తీసుకురా' .. తక్కువ రేటుకు పట్టుకున్నా అని మేస్త్రీ అనడంతో నేనున్నాకదా అనే సమాధానం వినిపించింది. ఈ విషయమై ఏఈని సంప్రదించగా, 'నేను లంచం అడగలేదు. వేరే వ్యక్తి నుంచి డబ్బులు పంపించారు. మళ్లీ తిరిగి అతనికే పంపించాను. ఇదంతా నాపై కావాలని ప్రచారం చేస్తున్నారు' అని వివరణ ఇచ్చారు. అయితే, వైరల్ అయిన ఆడియోపై విచారణ కోసం హౌసింగ్ పీడీ దామోదర్ డీఈని నియమించినట్లు సమాచారం.

మాత్‌పల్లిలో జాతీయ మానసికారోగ్య సర్వే


ఎన్ఎంహెచ్ సర్వేలో కేంద్ర వైద్య బృందం

కుకునూరుపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాత్‌పల్లి గ్రామంలో ఎయిమ్స్ బీబీనగర్, బెంగళూరు ఆధ్వర్యంలో నేషనల్ మెంటల్ హెల్త్‌సర్వే చేపట్టారు. ప్రాజెక్ట్ పరిశీలకులు డాక్టర్ కులకర్ణి, సాయికృష్ణ, స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి గ్రామ ప్రజల మానసిక, ఆరోగ్య, జీవనశైలి సమస్యలు వాటిపై అవగాహన చికిత్స ఇతర అంశాలను సేకరించారు. మానసిక సమస్యలకు 174416ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ సర్వే జాతీయ మానసిక ఆరోగ్య విధాన రూపకల్పనలో కీలకంగా ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

440 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా సరఫరా చేస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్ ప్లాజా వద్ద బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి హైదరాబాద్‌కు ఎండు గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటకకు చెందిన ఓ ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న కరీంనగర్‌కు చెందిన తాజ్ మహ్మద్ అనే వ్యక్తి వద్ద 440గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎండు గంజాయితోపాటు నిందితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

కుటుంబ పోషణ భారమై గృహిణి ఆత్మహత్య

తూప్రాన్, అగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భర్త మరణంతో కుటుంబ పోషణ భారమై గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానంద కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన గజ్జల బాబుకు మాసాయిపేటకు చెందిన సంధ్యతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆర్థిక ఇబ్బందులతో నాలుగు నెలల క్రితం గజ్జల బాబు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాబు భార్య సంధ్య(34) ఇద్దరు పిల్లలతో ఉంటోంది. కుటుంబ పోషణ భారం కావడంతో ఇబ్బందులను ఎదుర్కొంటుంది. 13న ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలను బయటకు పంపి వంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.









కోహెడలో ఎరువుల కోసం క్యూలో నిల్చున్న రైతులు

క్యూ కట్టి.. రోడ్డెక్కి..

యూరియా కోసం అన్నదాతల అవస్థలు.. ఆందోళనలు, రాస్తారోకోలు

రైతులు అవసరం మేరకే కొనుగోలు చేయాలి

- మెదక్ జిల్లాలో 900 మెట్రిక్ టన్నుల యూరియా
- మరో పది రోజుల్లో 1500 మెట్రిక్ టన్నులు వస్తుంది
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



టేక్మాల్ ఆగ్రోస్ సేవాకేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

టేక్మాల్/పాపన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం ఆయన టేక్మాల్ మండలంలోని ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాపన్నపేట మండలం లక్ష్మీనగర్‌లోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొందరు కావాలని వదంతులు సృష్టించడం వల్లనే రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 900 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, పది రోజుల్లో 1500 మెట్రిక్ టన్నులు వస్తుందన్నారు. సెప్టెంబరులో మరో 4000 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందకుండా అవసరం మేరకు కొనుగోలు చేయాలన్నారు నానో యూరియాను కూడా వాడాలని సూచించారు. తహసీల్దార్ తులసిరాం, ఎంపీడీవో రియాజోద్దీన్, ఏవో రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాకేష్ ఉన్నారు.



ముస్తాబాద్-సిద్దిపేట రోడ్డు రాఘవాపూర్ చౌరస్తాలో నిర్వహించిన ఆందోళనలో ఎస్ఐకి దండం పెడుతున్న రైతు



గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో ధర్నా చేస్తున్న రైతులు



మిరుదొడ్డి : అక్బర్‌పేట చౌరస్తాలో యూరియా కోసం రైతుల ధర్నా

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యూరియా కొరతతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు యూరియా వేయాల్సిన సమయం ఆసన్నం కావడంతో ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద రైతులు భారీగా క్యూ కడుతున్నారు. బుధవారం కూడా మండల కేంద్రాల్లోని పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాల వద్ద రైతులు బారులు తీరారు. సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ పలు చోట్ల రైతులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌లోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాశారు. బుధవారం 560 బస్తాల యూరియా లారీ రావడంతో రైతులు ఒక్కసారిగా తరలివచ్చారు. దీంతో అక్కడ తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. తమ ఆధార్, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను వెతుక్కోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వచ్చి రైతులను క్యూలైన్‌లో నిలబెట్టారు. ఎకరాకు ఒక బస్తా, ఆపైన భూమి ఉన్న వారికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. సరిపడా యూరియా దొరకని రైతులు నిరాశగా వెనుదిరిగారు.

నంగునూరులో చెప్పులతో క్యూ

నంగునూరు మండలంలోనూ రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. యూరియా కోసం తెల్లవారుజాము నుంచే సహకార సంఘాల వద్ద బారులు తీరారు. పాలమాకుల గ్రామంలో ఎరువుల లారీ రాకముందే తమ చెప్పులను క్యూలో పెట్టి రైతులు వేచి చూశారు. 20 ఏళ్లలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంటకు యూరియా వేయకపోతే దిగుబడి తగ్గుతుందని, పంటలు ఎర్రబారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పనులు మానుకొని వారం రోజులుగా ఎరువుల కోసం ఎదురుచూస్తున్నామని రైతు బుచ్చయ్య చెప్పారు.

రాస్తారోకోలు, ధర్నాలు..

సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేపట్టారు. గంటకు పైగా రాస్తారోకో జరగడంతో వాహనాలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో యూరియా కొరత ఉండేది కాదని, ఇప్పుడు యూరియా కోసం ఇళ్లు, వ్యవసాయం వదిలి పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రం అక్బర్‌పేట-భూంపల్లిలోనూ రైతులు ధర్నా నిర్వహించారు. చేగుంట మండలం మక్కరాజుపేటలోనూ యూరియా కొరతపై గజ్వేల్ రహదారిపై రైతులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో కూడా రైతులు ధర్నాకు దిగారు. రైతుల ఆందోళనలు గమనించిన పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి ధర్నాలను విరమింపజేశారు.

వారం రోజులుగా యూరియా రాలే..

నర్సాపూర్‌లో వారం రోజులుగా యూరియా రాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేయగా, రెండు రోజుల్లో వస్తుందని అధికారులు వారిని సముదాయించారు కౌల్దారం మండలం రంగంపేటలో ఒక లారీ యూరియా మాత్రమే రావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ మాట్లాడుతూ, రెండు రోజుల్లో యూరియా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. మిరుదొడ్డిలో ఎస్ఐ హరీష్ అధికారులతో మాట్లాడి యూరియా కొరత లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



దుబ్బాకలోని శివాజీ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన రైతులు



హుస్నాబాద్‌లో రైతులకు నచ్చజెప్పుతున్న పోలీసులు



చేగుంట మండలం మక్క రాజుపేటలో గజ్వేల్ రహదారిపై రైతుల బైఠాయింపు

చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి..

- మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన సిబ్బంది



చెరువులో ఉన్న విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నిండుకుండలా ఉన్న చెరువులోకి ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు చేశారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. 132 సబ్ స్టేషన్ నుంచి 33 కేవీ విద్యుత్ లైన్ ద్వారా దౌల్తాబాద్ మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా చేస్తారు. ఈ విద్యుత్ లైన్ మధ్యలో ఓ స్తంభంపై ఇన్సులేటర్ ఫెయిల్ అయి, మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ స్తంభం చెరువు మధ్యలో ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి చెరువు నిండుకుండా మారింది. ఎలాగైనా మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని పునుకున్న విద్యుత్ లైన్‌మన్ రాజేష్, ఏఎల్ఎంలు సుభాష్, అజయ్, రవీందర్, రాకేష్, జేఎల్ఎం అన్నజీర్, రాజశేఖర్, సీఎం శ్రీమాన్ నర్సింహులు బుధవారం సాయంత్రం చెరువులో ఈదుకుంటూ విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లారు. స్తంభం ఎక్కి ఇన్సులేటర్ సరిచేసి, మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా చేశారు. చెరువులోకి దిగి, ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు చేసిన విద్యుత్ అధికారులు, సిబ్బందిని మండల కేంద్ర ప్రజలు అభినందించారు.

ఆహార భద్రత చట్టం సక్రమంగా అమలవ్వాలి

- పంజాబ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ బాల్ ముకంద్ శర్మ



మాట్లాడుతున్న పంజాబ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ బాల్ ముకంద్ శర్మ

కోహీర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని పంజాబ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ బాల్ ముకంద్ శర్మ అన్నారు. బుధవారం ఆయన తెలంగాణ, పంజాబ్ ఫుడ్ కమిషన్ సభ్యులతో కలిసి కోహీర్ మండలం దిగ్వాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. పంజాబ్ రాష్ట్రంలోని 19 వేల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలను పాఠశాల ఆవరణలోనే పెంచుతున్నామని ఆయన తెలిపారు. తెలంగాణలో ఆహార భద్రత చట్టం అమలు తీరును పరిశీలించేందుకు తాము వచ్చామని చెప్పారు. దిగ్వాల్ పాఠశాలలో భోజనంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి తిన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణాన్ని కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ ఫుడ్ కమిషన్ సభ్యులు విజయ్ దత్త, చేతన్ ప్రకాష్ ధన్‌వాల్, జస్వీర్ సింగ్, తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు ఆనంద్, డీఈఓ వెంకటేశ్వర్లు, డీడబ్ల్యుఓ లలితకుమారి, టీజీఆర్ఓ అధికారిణి జ్యోతి, ఎంఈఓ జాకీర్ హుస్సేన్, సీడీపీఓ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా పెద్దచెరువు.. పొంచి ఉన్న ముంపు

- వందెకరాల జీవవైవిధ్య చెరువుకు జలకళ
- నీటమునిగిన కాలనీల రోడ్లు
- ముంపునకు గురయ్యే కాలనీలపై హైడ్రా నజర్

అమీన్‌పూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని శివారులో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ పెద్దచెరువు భారీ వర్షాలతో నిండిపోయింది. గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీరు పోటెత్తడంతో చెరువు మినీ రిజర్వాయర్‌లా కనిపిస్తోంది. వరదనీటి కాలువలు ఆక్రమణలకు గురికావడంతో పరిసర ప్రాంతాల కాలనీలకు ముంపు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు గరిష్ఠ నీటిమట్టం పెరిగితే లోతట్టు ప్రాంతాలైన పాంచజన్య, వెదిరి, వాణినగర్, హెచ్ఎంటీ కాలనీల్లోని కొన్ని ఇళ్లు మునిగిపోయే ప్రమాదం ఉంది. వరద కాలువలను పునరుద్ధరించాలని గ్రామస్తులు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులను కోరుతున్నారు.

కాలనీల రోడ్లు జలమయం

పెద్దచెరువుకు అనుసంధానంగా ఉన్న బంధంకొమ్ము చెరువులోకి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇక్కడి కాలువలను కూడా ఆక్రమించడంతో భవానీపురం, వీరారెడ్డి కాలనీ, వెంకటరమణ కాలనీలలోని రోడ్లు నీట మునిగాయి. వరదనీరు మరింత పెరిగితే ఇళ్లు, అపార్ట్‌మెంట్ల సెల్లార్లు కూడా నిండిపోయే ప్రమాదం ఉందని కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొందరు నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో, హైడ్రా సిబ్బంది కాలనీలను పరిశీలించారు. అవంతిక అనే నిర్మాణ సంస్థ దారిమళ్లించిన వరద కాల్వను పరిశీలించారు. నీరు ముంచెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలను అప్రమత్తం చేశారు. వరద కాలువలపై సమగ్ర సర్వే నిర్వహించి వాటిని పునరుద్ధరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.



నిండుకుండను తలపిస్తున్న అమీన్‌పూర్ పెద్దచెరువు

మల్లన్నసాగర్‌లో కొత్త లొల్లి

- తాత్కాలికంగా ఒకరికి డబుల్ ఇల్లు..
- రిజిస్ట్రేషన్ మరొకరికి..
- ఖాళీ చేయించడంతో మనస్థాపం
- భార్యాపిల్లలతో కలిసి అదృశ్యం

గజ్వేల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ కాలనీలో కొత్త లొల్లి షురూ అయింది. గతంలో గ్రామాన్ని ఖాళీ చేయించిన సమయంలో ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామానికి చెందిన అరికెల చంద్రంకు తాత్కాలికంగా ఓ డబుల్ బెడ్‌రూం ఇంటిని కేటాయించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా ఆ ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని అప్పటి అధికారులు హామీ ఇవ్వడంతో చంద్రం తనకు వచ్చిన ప్యాకేజీ డబ్బులతో ఇంటిని బాగు చేయించుకున్నారు. ఇదే ఇంటిని గ్రామానికి చెందిన మరో బాధితుడికి రిజిస్ట్రేషన్ చేయడంతో సదరు వ్యక్తిని ఇంటిని ఖాళీ చేయించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అతను సిద్దిపేట ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం గజ్వేల్ ఆర్ఐ, పోలీసుల సహకారంతో ఇంట్లోని వస్తువులను పక్కన గదిలో పెట్టి ఇంటిని రిజిస్ట్రేషన్ అయిన వ్యక్తికి అప్పగించారు. దీంతో అధికారులతో చంద్రం వాగ్వాదానికి దిగారు. తాను ఇంటి మరమ్మత్తులకు దాదాపుగా రూ.12లక్షలు వెచ్చించానని, ఆ డబ్బులు ఇప్పించాలని చంద్రం కోరాడు. తన ఇంటిని అధికారులు బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని ఆవేదన చెందిన చంద్రం తన భార్యపిల్లలతో సహా కనిపించకుండా పోయాడు. దీంతో అధికారులపై చంద్రం తండ్రి బాలయ్య గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. చంద్రంకు రావాల్సిన ఆర్అండ్ఆర్‌లో భాగంగా ప్యాకేజీ, ప్లాటు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన డబ్బులు వచ్చాయని, అయినప్పటికి ఖాళీ చేయడం లేదని అధికారులు తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ... చంద్రంకు న్యాయంగా రావాల్సిన మరమ్మత్తుల డబ్బులు ఇప్పించాలన్నారు. గతంలో అధికారులే ఇంటి మరమ్మతుకు సంబంధించి అంచనా వేసి రూ.8 లక్షలుగా తేల్చారని, ప్రస్తుతం అదే అధికారులు బయటకు పంపించడం సరికాదన్నారు. చంద్రం కుటుంబసభ్యుల ఆచూకీ కోసం గ్రామస్థులు మల్లన్నసాగర్ కట్టపై వెతుకుతున్నట్లు తెలిసింది.

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర పీఆర్వో కమిటీ కన్వీనర్‌గా రాజశేఖర్ కులకర్ణి

జోగిపేట, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) ప్రజా సంబంధాల విభాగం (పీఆర్వో కమిటీ) కన్వీనర్‌గా జోగిపేటకు చెందిన రాజశేఖర్ కులకర్ణి ఏకగ్రీవంగా నియామకమయ్యారు. మంగళవారం వరంగల్‌లో జరిగిన సమావేశంలో ఈమేరకు ఆయన పదవీ స్వీకార ప్రమాణం చేశారు. రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా సంగారెడ్డికి చెందిన విజయ భాస్కర్ దేశ్‌పాండే, కోకన్వీనర్‌గా సంగారెడ్డికి చెందిన రవిశంకర్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా శ్యామ్‌రావు పట్వారీ, వాసుదేవరావు, సురేశ్ జ్యోషి, మహిళా విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శిరీష కులకర్ణి, యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా కరణం మారుతి రావు, పాండురంగా రావు, తిరుమల్‌రావు నియమితులయ్యారు.

న్యూస్ బాక్స్

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

దుబ్బాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజక వర్గంలోని కొన్ని మండలాల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు అందించాలని దుబ్బాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర కార్మిక, గనులు, ఉపాధిశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. దుబ్బాకలో ఆయనను కలిసి, జర్నలిస్టుల సమస్యలను వివరించారు. దుబ్బాక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజమల్లు అధ్వర్యంలో ఇళ్ల స్థలాలు ఉన్న జర్నలిస్టులకు ప్రత్యేక కోటా కిందా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలనీ, స్థలాలు లేనివారికి స్థలాలతోపాటు, ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని కోరారు. రూ.20 లక్షలను ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి ఇవ్వాలని, భవనానికి కూడా స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిన్నకోడూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో తండ్రి, కుమారుడు మృతి చెందడం దురదృష్టకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. చంద్లాపూర్‌కు చెందిన తండ్రి కుమారుడు ముర్తి గజేందర్‌రెడ్డి(52), రాజిరెడ్డి (25) ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం విదితమే. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించి ఓదార్చారు. చంద్లాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గౌరవ్వకు ఇటీవల కాలుకు చికిత్స జరగగా ఆమెనుపరామర్శించారు. అంతకు ముందు ఓబులాపూర్‌లో జర్నలిస్టు శ్రీధర్‌రెడ్డి తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

50 మంది ఆడబిడ్డలకు పుస్తె మట్టెల పంపిణీ

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలంలో సుమారు 50 మంది ఆడ బిడ్డలకు మిట్టపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జేపీ యాదవ్ పుస్తె మట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం అతడిని పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో ఘనంగా సన్మానించారు. నిస్వార్థంగా పేదలకు సేవలు అందిస్తున్న జేపీ యాదవ్‌ను గ్రామస్థులు అభినందించారు.

సరిపడా యూరియాను అందించాలి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి); రూరల్ మండలంలోని రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు మల్లమ్మగారి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం సిద్దిపేట ఏడీఏ పద్మకు వినతిపత్రాన్ని రైతులతో కలిసి అందజేశారు. యురియా సరఫరాలో జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

యూరియాను బ్లాక్ చేస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

కొమురవెల్లి,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి):సిద్దిపేట జిల్లాలో యూరియాను బ్లాక్ చేసి విక్రయిస్తున్న ఫర్టిలైజర్ దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలనీ సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి బుధవారం ఆయన మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సకాలంలో యూరియాను అందించడంలో విఫలమయ్యాయన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు యూరియా లభించడం లేదన్నారు. సత్వరమే తగినంతగా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలనీ లేని పక్షంలో సీపీఎం తరపున ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

కంపుకొడుతున్న గోవర్ధనగిరి

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు


గోవర్ధనగిరి పిచ్చి చెట్లతో నిండిన మురుగుకాలువ


ఓ వార్డులో డ్రైనేజీలు లేక రోడ్లపైకి చేరిన మురుగునీరు

అక్కన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో పారిశుధ్యం లోపించి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. నివాసాల ముందు మురుగునీరు రోజుల తరబడి నిలిచి, ఎక్కడిక్కడే చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈగలు, దోమల బెడద ఎక్కువై ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. పలు వార్డుల్లో డ్రైనేజీలు లేక నీరు రోడ్లపైకి వచ్చి బురదగుంట ఏర్పడి మురుగు నీరు నిలుస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, వీధుల్లో పారిశుధ్య పనులు సరిగా చేయకపోవడం పట్ల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలం కావడంతో గ్రామంలో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలడంతో తాము ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సివస్తోందని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

పంచాయతీలో ఉన్న ఫాగింగ్ మిషన్లు మరమ్మతులు చేయించలేక మూలన పడేశారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామంలో ఎక్కడికక్కడ సమస్యలు మరింత ఎక్కువైతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని గ్రామస్థులు తప్పు పడుతున్నారు. గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుండగా, స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో అమలు కావడం లేదని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వైద్య సేవల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


సిద్దిపేట అర్బన్: ఎన్సాన్‌పల్లిలో హాస్టల్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట రూరల్/సిద్దిపేట అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్, లోకల్ బాడీస్ గరీమా అగర్వాల్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పల్లె దవాఖానాను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. అదేవిధంగా సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది మరియు స్టోర్ రూమ్ ను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

●గజ్వేల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని కిచెన్, భోజనశాల, భోజనం, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులతో కలసి సమస్యలను గూర్చి ఆరా తీశారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మైనారిటీ బాలికల పాఠశాలను గజ్వేల్ మండల వ్యవసాయ శాఖ ఏడీ ఎల్ బాబునాయక్ సందర్శించారు. పిల్లల డైట్‌మెనూను పరిశీలించిన అనంతరం పిల్లలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.

రేపటి నుంచి గ్రామాల్లో పనుల జాతర

● జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22న శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో పనుల జాతర కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌తో కలిసి బుధవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పనుల జాతర కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్‌మిషన్ ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరాశాఖల ద్వారా చేపట్టిన పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుపరిచేందుకు గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల ప్రహరీలు, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇవే కాకుండా ఉపాధి హామీ పథకంలో ప్రజలకు వ్యక్తిగత లబ్ధి చేకూర్చే పౌల్ట్రీ షెడ్లు, పశువుల పాకలు, ఇంకుడు గుంతలు కొత్తగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పనులను చేపట్టనున్నట్లు ఆమె వివరించారు. అన్ని గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని ఆదేశించారు. సంబంధిత ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొనేలా వారికి ముందస్తు సమాచారం అందించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జూమ్ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, సీఈవో రమేష్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, ఆయా మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ మస్కిటో డే

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రోనాల్డ్‌రాస్ ఆగస్టు 20న మొట్టమొదటిగా మలేరియా ఎనాఫిలిస్ అనే దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని కనుగొన్నాడని, నాటి నుంచి వరల్డ్ మస్కిటో డే నిర్వహిస్తున్నారని వక్తలు తెలిపారు. దోమలను అరికట్టడానికి తీసుకోవలసిన తగు జాగ్రత్తలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, బయోటెక్నాలజీ విభాగాధిపతి వి. రోహిణి, అధ్యాపకులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం విద్యార్థులతో కలిసి ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం అండ్ పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు.

ఆన్‌లైన్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జేఈఈ, నీట్, ఎప్‌సెట్ ఎంట్రన్స్ పరీక్షల కోసం సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్లాసులను బుధవారం డీఐఈవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఉత్తమ ర్యాంకుల సాధించేందుకు ఆన్‌లైన్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలలో రోజువారి తరగతులతో పాటు ఆన్‌లైన్ తరగతులు క్రమం తప్పకుండా నిర్వహించాలని కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డికి సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 11 మందికి జరిమానా

గజ్వేల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 11 మంది పట్టుబడినట్టు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళీ పేర్కొన్నారు. వారిని బుధవారం గజ్వేల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా నిందితులకు రూ.17వేల జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ వివరించారు.

సమన్వయంతో పనిచేయాలి: ఏసీపీ


కోమటి చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ప్రారంభం కానున్న వినాయక నవరాత్రుల సందర్భంగా నిమజ్జనానికి వెళ్లే దారులు, నిమజ్జనం జరిగే కోమటి చెరువు ప్రాంతాన్ని పోలీస్, మున్సిపల్, ఎలక్ట్రిసిటి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం జరిగే ప్రదేశంతో పాటు నిమజ్జనానికి వచ్చే రూట్ వద్ద కూడా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనులు పూర్తి చేసి నిమజ్జనానికి సిద్ధం కావాలని సూచించారు. వినాయక విగ్రహాలు కొనుగోలు చేసి మండపాలకు తీసుకెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల సూచనలు పాటించాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, విద్యుత్ శాఖ అధికారులు, నేషనల్ హైవే రోడ్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి

● **కొమురవెల్లి:** వినాయకచవితి పండుగను కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ రాజుగౌడ్ సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాల ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

హుస్నాబాద్‌లో వాసవీమాతకు సారె


వాసవీ మాతకు సారె, ఒడిబియ్యం సమర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో వాసవీమాతకు చీరె సారే, ఒడిబియ్యం సమర్పించారు. ఏటా శ్రావణ మాసంలో బుధవారం అమ్మవారికి చీరె, సారె, ఒడిబియ్యం సమర్పించే సంప్రదాయం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రైతులను మోసగిస్తున్న కేంద్రం


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతులను చిన్నచూపు చూస్తూ, కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తున్నదని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ మండిపడ్డారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలిసి పూజల హరికృష్ణ మాట్లాడారు. సకాలంలో రైతులకు యూరియా అందించాల్సిన కేంద్రం, తెలంగాణ రాష్ట్ర రైతుల పట్ల నిర్లక్ష్యం ధోరణిని ప్రదర్శిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్ ఎన్నికల్లో రైతుల నుంచి ఓట్లు రాబట్టుకునేందుకు, ఎరువులను మోదీ బీహార్‌కు తరలిస్తున్నాడని తెలిపారు. రైతుల పేరుతో బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయాలు చేయవద్దని, ధర్నాలు, రాస్తారోకోలు ఢిల్లీలో చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, సాకీ ఆనంద్, రియాజుద్దీన్, కలిముద్దీన్, మీసం మహేందర్, రాజ్ బహదూర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

● కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని అందు కోసం కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యక్రమానికి సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వారికి అండగా నిలుస్తానన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆకుల రజిత వెంకన్న, సుద్దాల చంద్రయ్య, వైస్‌చైర్మన్ అయిలేని అనిత, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గౌరారంలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

వర్గల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం గౌరారంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద స్వర్గీయ పల్లె నర్సింలుగౌడ్ జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని పల్లె శ్రీకాంత్ గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలి

గజ్వేల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో విద్యార్థులతో కలసి ఆయన జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏడాది కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించినట్టు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఇతర విద్యారంగ సమస్యలపై పోరాటం చేశామని గుర్తు చేశారు. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డుపై వరద నీరు.. ప్రయాణికులకు ఇక్కట్లు

చేర్యాల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : చేర్యాల - కొమురవెల్లి ప్రధాన రహదారిపై మండలంలోని వేచరేణి శివారులో రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. కల్వర్టు నిర్మించినప్పటికీ పూడుకుపోవడంతో నీరు మళ్లడంలేదు. దీంతో ప్రధాన రహదారిపై నుంచి ప్రవహిస్తుండటం వల్ల రోడ్డు దెబ్బతినడంతో పాటు వాహనాలపై విరజిమ్ముతుంది. సంబంధిత అధి కారులకు తెలిపినా పట్టించుకోకపోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం ఈదారి వెంబడి కొమురవెల్లి మల్లన్న ఆలయంతో పాటు రాజీవ్‌రహదారి మీదుగా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తారు. అధికారులు నిర్లక్ష్యం వీడి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకముందే ప్రత్యామ్నాయచర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..


చేర్యాలలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల/కొమురవెల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రాంత ప్రజల ప్రేమాభిమానాలు మరవలేనివని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కాలికి గాయం కావడంతో సుమారు రెండున్నర నెలల అనంతరం తొలిసారి నియోజకవర్గంలో అడుగుపెట్టిన సందర్భంగా బుధవారం చేర్యాల పట్టణంలోని రేణుకాగార్డెన్స్‌లో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళిమిట్ట మండలాల పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల దీవెనలతో త్వరగా గాయం నుంచి కోలుకున్నట్టు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నానన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అన్నింటా విఫలమైందని విమర్శించారు. అంతకుముందు పార్టీ కార్యకర్తలతో గుర్జకుంట క్రాస్‌రోడ్డు నుండి చుంచనకోట క్రాస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా తొలుత ఎమ్మెల్యే కార్యకర్తలతో కలిసి కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఎమ్మెల్యేను వేద మంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయాధికారులు శేషవస్త్రాలు, ప్రసాదాలను అందించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు ఎనుగుల రాకేశ్ రెడ్డి, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, అంకుగారి స్వరూపారాణి, వుల్లంపల్లి కరుణాకర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, తలారి కీర్తన, నాచగోని పద్మ, సిలివేరి సిద్దప్ప, గీస భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం

● ఉమ్మడి మెదక్ జిల్లా డీడీ

రాయపోల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడం కోసం ప్రభుత్వం ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని చేపట్టిందని ఉల్లాస్ కార్యక్రమ ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయపోల్‌లో జరిగిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించామని, అలా వారిని అక్షరాస్యులుగా చేసేందుకు వాలంటరీ టీచర్లను నియమించామని తెలిపారు.


రాయపోల్‌లో మాట్లాడుతున్న డీడీ వెంకట్‌రెడ్డి

వాలంటరీ టీచర్ల శిక్షణ పూర్తయిన తర్వాత సెప్టెంబర్ 8న ఉల్లాస్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

●జగదేవ్‌పూర్/మర్కుక్/దుబ్బాక/మిరుదొడ్డి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్‌లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నవభారత్ సాక్షరత కార్యక్రమం ఉల్లాస్ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గ్రామైక్య సంఘాల నాయకులకు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాధవరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా చేసే బాధ్యత అందరూ తీసుకోవాలని మర్కుక్ మండలంలోని ఉన్నత పాఠశాల పాములపర్తిలో ఉల్లాస్ అంశంపై శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్రాములు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు విద్యా సహాయాన్ని అందించడమే ఉల్లాస్ లక్ష్యమన్నారు. అదేవిధంగా దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో ఆయా మండల విద్యాధికారులు ప్రభుదాస్, అంజయ్యల ఆధ్వర్యంలో ఉల్లాస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెరువుల్లోకి.. చేప

(5వ పేజీ తరువాయి)

నెలకొన్నది. టెండర్ల ప్రక్రియ ఆలస్యమైనప్పటికీ, నాణ్యమైన చేప పిల్లలను అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

టెండర్ల ఆహ్వానం



ప్రభుత్వ ఆదేశాల మేరకు చేప పిల్లల పంపిణీకి టెండర్లు ఆహ్వానిస్తున్నాం. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే జిల్లాలోని 1715 రిజర్వాయర్లు, చెరువులలో 4.42 కోట్ల చేప పిల్లలను వేస్తాం.

\- మల్లేశం, జిల్లా మత్స్యశాఖ అధికారి

వివాహితను కాపాడిన కానిస్టేబుల్‌కు సత్కారం

చేర్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని పెద్దచెరువులో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వివాహిత ప్రాణం కాపాడిన పోలీస్ కానిస్టేబుల్ స్వామిపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు, పట్టణాధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి, ఇతర నాయకులతో కలిసి కానిస్టేబుల్ స్వామిని సన్మానించారు. అలాగే సీపీఎం నాయకులు కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు, బోయిని మల్లేశం, తుప్పతి రాజు తదితరులు శాలువాకప్పి సన్మానించారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


చేర్యాలలో రాజీవ్‌గాంధీ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


హుస్నాబాద్‌లోని ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, నాయకులు


గజ్వేల్ పట్టణంలోని నర్సారెడ్డి నివాసంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమాలను బుధవారం జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్లు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని పొన్నాల చౌరస్తా వద్దనున్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. చేర్యాల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండలాధ్యక్షుడు కొమ్ము రవి తదితరులు రాజీవ్‌గాంధీ ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పించారు. కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కన్నపేటలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నివాసంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డితో కలసి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.